
సాక్షి
బాపట్ల
సోమవారం ।30। డిసెంబర్ । 2024



ధనుర్మాస పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి గుడిలో ఆదివారం శ్రీవారికి మత్స్య అలంకరణ చేపట్టి పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆది వారం 572.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,578 క్యూసెక్కులు వదిలారు.

మహానందీశ్వరునికి అభిషేకాలు



నరసరావుపేట రూరల్: కోటప్ప కొండ త్రికోటేశ్వర స్వామి ఆలయం లోని మహా నందీ శ్వరునికి ఆది వారం పంచామృత సహిత విశేష ద్రవ్యాలతో ప్రదోషకాల అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

బగళాముఖి ఆలయంలో మాజీ సీజే ఎన్వీ రమణ



చందోలు(కర్లపాలెం): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ దంపతులు ఆదివారం పిట్టలవానిపాలెం మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఎన్వీ రమణ దంపతులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు ఆలయ వేద పండితులతో కలిసి మంగళ వాయిద్యాలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఎన్వీ రమణ దంపతులు బగళాముఖి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి హోమగుండం పూజలలో పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి పుష్ప కిరీటంతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, ఆలయ అధికారి కె.నాగేశ్వరరావు, జనసేన సమన్వయకర్త శివన్నారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



నగరంపాలెం: ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్షుడిగా యేల్చూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. గుంటూరు జిన్నాటవర్ కూడలిలోని సంస్థ కార్యాలయంలో శనివారం కార్యవర్గ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అధ్యక్ష పదవికి యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ, ఆర్.వి.రామకృష్ణ ప్యానెల్స్ పోటీపడ్డాయి. 985 ఓట్లు నమోదయ్యాయి. లెక్కింపు ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల వరకు కొనసాగింది. యేల్చూరి వెంకటేశ్వర్లకు 577, రంగా బాలకృష్ణకు 397, ఆర్.వి. రామకృష్ణకు ఎనిమిది ఓట్లు వచ్చాయి. మరో మూడు ఓట్లు చెల్లలేదని కార్యాలయ వర్గాలు తెలిపాయి. వెంకటేశ్వర్లు ప్యానెల్ విజయంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వర్గాలు సంబరాలు చేసుకున్నాయి. టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, ఈరంటి వరప్రసాద్, అంకరావు, టీఎల్వీ వీరాంజనేయులు, అన్న పూర్ణచంద్రరావు, కొత్త మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీఓ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. 30న వన్‌మాన్ కమిషన్ జిల్లా పర్యటన, జిల్లా పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ కానిస్టేబుళ్ల ఉద్యోగాల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల దృష్ట్యా రద్దు చేశామని, జిల్లాలోని ప్రజలు గమనించాలని కోరారు.

భక్తులకు చిన్న జీయర్ స్వామి ఉపదేశం



తాడేపల్లి రూరల్: మంగళగిరి ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 14వ పాశురాన్ని ఆదివారం భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వివరించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. మహోత్సవాలలో భాగంగా ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తరం నిర్వహించామని చెప్పారు. గుంటూరు, విజయనగరం, విజయవాడ ప్రాంతాలకు చెందిన భక్తులు గోదాదేవికి సారె సమర్పించారని తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్టి, మంగళ శాసనాలతో కార్యక్రమాలు వైభవంగా జరిగాయని వివరించారు. భక్తులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు కూచిపూడి నృత్యాలు చేశారని తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 98, నిజాంపట్నం కాలువకు 69, కొమ్మమూరు కాలువకు 1217 క్యూసెక్కులు విడుదల చేశారు.

చర్యలు తీసుకుందేరూ?

యథేచ్ఛగా కుందేరు కబ్జా !

- ప్లాట్లు, రొయ్యల చెరువులు వేసి విక్రయాలు
- రూ.కోట్ల విలువైన భూమి అక్రమార్కుల చేతుల్లోకి..
- చోద్యం చూస్తున్న డ్రెయినేజీ అధికారులు



కుందేరు ప్రాంతలో నిర్మించిన నిర్మాణాలు

చీరాల: కుందేరు డ్రెయిన్ చరిత్ర విశిష్టమైనది. తుఫాన్‌లు, భారీ వర్షాలు, వాగులు పొంగి పొర్లుతూ చీరాల నుంచి చినగంజాం వరకు ముంచెత్తే రోజుల్లో ముంపు నుంచి కాపాడి వరద నీటిని సముద్రంలోకి పంపే ఏకైక వనరుగా డ్రెయిన్ ప్రాధాన్యం సంతరించుకుంది. కాలక్రమేణా ఈపురుపాలెం, వేటపాలెం స్ట్రయిట్‌కట్‌ల ద్వారా వరద నీరు సముద్రంలోకి వెళ్లి నేరుగా కలుస్తుండడంతో కుందేరు ప్రాబల్యం క్రమంగా తగ్గుతూ వచ్చింది.

అక్రమార్కుల చెరలో..

ప్రస్తుతం పట్టణంలో, గ్రామాలలో వచ్చే మురుగునీరు మాత్రమే కుందేరులో కలుస్తోంది. దీంతో కుందేరులో ఉన్న వందలాది ఎకరాలను అక్రమార్కులు చెరబట్టారు. వేటపాలెం నుంచి చినగంజాం వరకు రొయ్యల చెరువులు సాగు చేస్తుండగా చీరాల పట్టణం నుంచి వేటపాలెం వరకు నివాసాలు, భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ ఆక్రమణలపై ఫిర్యాదులందినా స్థానిక అధికారులు మాత్రం ఇవి ఎప్పటి నుంచో జరుగుతున్నాయని, తాము ఇప్పుడు ఏమీ చేయలేమని, కేవలం నోటీసులు ఇచ్చి మమ అనిపిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి చెందిన వందలాది ఎకరాలు అక్రమార్కుల సొంతం కాగా ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వానికి సెంటు భూమి దొరకడం కూడా కష్టంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో కొద్దోగొప్పో ఉన్న కుందేరు భూములూ రోజురోజుకూ ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ భూముల విలువ ఇప్పుడు రూ.కోట్లలో పలుకుతోందంటే అతిశయోక్తి కాదు. వంద ఎకరాలపైన కబ్జాదారుల కబంధ హస్తాలలో ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు.



కుందేరు వద్ద నిర్మించిన నివాస గృహాలు

21 కిలో మీటర్ల మేర కుందేరు..

గతంలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా కురిసిన వర్షాలు, వరదల సమయంలో సముద్రం దగ్గరగా ఉన్న చీరాలపైకి వరద నీరు వచ్చి ముంపునకు గురవుతుండేది. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు బాపట్ల నుంచి చినగంజాం వరకు కుందేరు డ్రెయినేజీని 21 కిలో మీటర్ల పొడవున 350 ఎకరాలలో 25 మీటర్ల వెడల్పులో తవ్వించారు. వరద నీరు దీని ద్వారా సముద్రంలో కలుస్తుండేది. అయితే ఈపురుపాలెం స్ట్రయిట్ కట్, వేటపాలెం స్ట్రయిట్‌కట్‌లను నిర్మించి, నేరుగా వరద నీరు సముద్రంలోకి పోయేలా చేయడంతో కుందేరు అవసరం ప్రస్తుతం లేకుండా పోయింది.

లక్షలు పలుకుతున్న భూములు

కుందేరు చీరాల పట్టణంతోపాటు వేటపాలెం మండలంలో నివాసాల మధ్యే ఉండడంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఎకరం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకుపైనే పలుకుతుంది. ఈ భూములపై కన్నేసిన అక్రమార్కులు కాలువ పక్కనే ఉన్న కుందేరు భూములను ఆక్రమించారు. చీరాల కోర్టు వద్ద విలువైన భూములను ఆక్రమించి బ్రిక్స్ యూనిట్లను ఏర్పాటు చేశారు. కొత్తపేట కుందేరు వద్ద పలు భవనాలను నిర్మించడంతోపాటు రాజకీయ పార్టీ నాయకులు కూడా పెద్ద ఎత్తున భూములను ఆక్రమించి నిర్మాణాలు చేశారు. అలాగే సంపత్‌నగర్ వద్ద ఉన్న కుందేరు భూములను ఆక్రమించి రంపపుకోత మిషన్‌తోపాటు పదుల కొద్ది నివాస గృహాలను నిర్మించారు. వేటపాలెం మండలంలో కుందేరు భూములను ఆక్రమించి ఏకంగా రొయ్యల చెరువులుగా మార్చారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూములు అన్యాక్రాంతమవుతున్నా అడిగే నాథుడే లేరు. ఈ భూములు డ్రెయినేజీ శాఖకు చెందినవి. అయితే ఈ భూములకూ కొందరు అక్రమార్కులు రెవెన్యూ శాఖ అధికారుల అండదండలతో పట్టాలు పుట్టించారు. ఏకంగా క్రయవిక్రయాలు జరుపుతుండడం గమనార్హం. వీటిపై సమగ్ర విచారణ జరిపితే అక్రమార్కుల బాగోతం బయట పడుతుంది. ఈ దిశగా సర్కారు చర్యలు చేపట్టాలి.

నోటీసులు ఇచ్చాం.. చర్యలు తీసుకుంటాం

కుందేరు ప్రాంతంలో భూముల ఆక్రమణదారులకు నోటీలు ఇచ్చాం. త్వరలో చర్యలు తీసుకుంటాం. చీరాల నుంచి వేటపాలెం మండలం పుల్లరిపాలెం వరకు కుందేరు భూములు ఆక్రమణకు గురయ్యాయి. వాటిపై ప్రత్యేకంగా రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో చర్యలు చేపడతాం.

– సుబ్బారావు డీఈ డ్రెయినేజీ శాఖ, చీరాల



నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ నెల 30 నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ఈ పరీక్షల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కొలతలు తీసే కంప్యూటర్ యంత్రాల పనితీరును పరిశీలించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులు రావాలని సూచించారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), డీపీఓ ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా 3 కిలోల వెండి



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు వినుకొండకు చెందిన భక్తులు ఆదివారం 3 కిలోల వెండిని కానుకగా సమర్పించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన ఎంవీ ఫణీంద్ర కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ఈవో కేఎస్ రామారావును కలిసి 3 కేజీల వెండి బార్ల(ఐదు)ను అందజేశారు. అధికారులు దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.



పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

అద్దె భవనంలోనే అద్దంకి గ్రంథాలయం

- 60 ఏళ్లుగా ఇదే దుస్థితి
- నీరు కారుతున్న భవనం
- పాడైపోతున్న విలువైన పుస్తకాలు
- సిబ్బంది కొరతతో వారానికి మూడురోజులే తెరిచేది!
- ఏటా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆదాయం
- సొంత భవన నిర్మాణంపై దృష్టిపెట్టని అధికారులు

అద్దంకి: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పురాతన గ్రంథాలయాల్లో అద్దంకి లైబ్రరీ ఒకటి. ఈ గ్రంథాలయాన్ని 1954లో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ సొంత భవనం సమకూరలేదు. ఈ లైబ్రరీలో ప్రస్తుతం 14,985 పుస్తకాలు ఉన్నాయి. 2,200 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. మున్సిపాలిటీ హోదా ఉన్న అద్దంకి పట్టణంలోని 25 వేల గృహాల నుంచి ఏటా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు గ్రంథాలయ సెస్ ద్వారా జిల్లా గ్రంథాలయానికి జమవుతోంది. అయినా గ్రంథాలయానికి సొంత భవన నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

అద్దె భారం.. వసతుల లేమి

ప్రస్తుతం లైబ్రరీ ఉన్న అద్దె భవనానికి నెలకు రూ.5,172 చొప్పున ఏటా రూ.62 వేలకు పైగా అధికారులు చెల్లిస్తున్నారు. ఈ భవనం పాతది కావడంతో వర్షానికి కారుతోంది. ఫలితంగా పుస్తకాలు పాడైపోతున్నాయి. దానికి తోడు ఇక్కడున్న గ్రంథపాలకునికి నియోజకవర్గంలోని కొరిశపాడు, బల్లికురవ గ్రంథాలయాలకు డెప్యూటేషన్ వేయడం ఇబ్బందిగా మారింది. ఇక్కడ గ్రంథాలయం ఆది, మంగళ, గురువారాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు మధ్యాహ్నం 4 నుంచి 7 గంటల వరకు మాత్రమే తెరిచి ఉటుంది. ఒకేఒక్క లైబ్రేరియన్ ఉండడంతో సిబ్బంది కొరత వేధిస్తోంది.

ఐదు సెంట్ల భూమి కరువా.. ?

నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ శాఖ నుంచి గతంలో రెండు సార్లు రాజా రామ్మోహన్‌రాయ్ సంస్థ ఫౌండేషన్ నిధులు ఇచ్చింది. అధికారుల నిర్లక్ష్యంతో స్థలం చూపించకపోవడంతో వచ్చిన నిధులు వెనక్కి వెళ్లాయి. స్థానికంగా ఉన్న పెద్దలు గ్రంథాలయ భవనం నిర్మాణం కోసం స్థానిక అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. కనీసం 5 నుంచి 10 సెంట్ల భూమి కేటాయించాలన్నా స్పందన లేదు.

స్థలం కేటాయించాలి



గ్రంథాలయానికి అవసరమైన భూమిని కేటాయించాలని కోరుతూ ఇప్పటికే రెండు మూడు సార్లు స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాలు ఇచ్చాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థలం కేటాయించాలి.

– విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రచయిత, శాసన పరిశోధకుడు

ముఖ్యమైన అంశం ఇది..



పట్టణంలో గ్రంథాలయం ఉండటం చాలా అవసరం. పట్టణంలోని గ్రంథాలయంలో ఎంతో విలువైన పుస్తక సంపద ఉంది. కానీ అద్దె భవనంలో సాగుతోంది. అక్కడ వసతి సరిగా లేదు. కొత్త భవన నిర్మాణానికి అధికారులు స్పందించి స్థలం కేటాయించాలి.

– చెన్నుపాటి రామాంజనేయులు, రచయిత

వినతి పత్రాలు ఇచ్చాం..



సొంత భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతి పత్రాలు ఇస్తున్నాం. స్థానిక ప్రజా ప్రతినిధులను కలసి చెప్పాం. సొంత భవనం నిర్మిస్తే అందులోకి రెండు కంప్యూటర్లు, మరిన్ని పుస్తకాలు వస్తాయి. విద్యార్థులు, పాఠకులు చదవుకోవడానికి బాగుంటుంది. స్థలం కేటాయించాలి.

– సుగుణరావు, గ్రంథపాలకుడు

అనుభువించు రాజా!

- పేదల స్థలాలు కబ్జా
- స్థలాలు దున్ని మినుము సాగు
- రెవెన్యూ మంత్రి అనగాని ఇలాకాలోనే కూటమి నేతల దురాగతం
- ల్యాండ్ గ్రాబింగ్ చట్టం వారికి వర్తించదా?
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



బొరమాదిగపల్లిలో ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములలో మినుము సాగు చేపట్టగా వచ్చిన మొక్కలు

నగరం: సాక్షాత్తూ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకాలో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల లే అవుట్‌ను టీడీపీ నాయకులు దర్జాగా కబ్జా చేశారు. అంతటితో ఆగక ఎంచక్కా సాగుచేసుకుంటూ ఫలసాయాన్ని అనుభవిస్తున్నారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ద్వారా కబ్జాకోరుల అంతు చూస్తామని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తమ నేతలు చేస్తున్న కబ్జాలు కానరావడం లేదా అనే విమర్శలు రేపల్లె నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 2024 ప్రకారం.. కబ్జాదారులకు 10–14 ఏళ్ల జైలు శిక్ష ఉంటుందంటూ ప్రభుత్వం చెబుతోంది. మరి ఈ చట్టం కూటమి నేతలకు వర్తించదా అంటూ ప్రతిపక్షాలు పెదవి విరుస్తున్నాయి.

మెండుగా సత్యప్రసాద్ ఆశీస్సులు!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రేపల్లె నియోజకవర్గంలో కూటమి నేతల ఆగడాలు శ్రుతిమించాయి. వీరికి మంత్రి సత్యప్రసాద్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అందుకే అధికారులు టీడీపీ నేతలు ఏం చేసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీనికి బోరమాదిగ పల్లెలో ఆక్రమణకు గురైన ఇళ్లస్థలాల ఉదంతమే నిదర్శనంగా నిలుస్తోంది.



లబ్ధిదారులకు గత ప్రభుత్వ హయాంలో ఇళ్లస్థల పట్టాలు ఇచ్చిన దృశ్యం(ఫైల్)

గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాలపై కన్ను!

నగరం మండలంలోని బొరమాదిగపల్లి గ్రామ సచివాలయం పక్కన సర్వే నెంబర్ 148–3 ఏ.బీ.150–2 లో 1.88 ఎకరాల భూమిని గ్రామంలో అర్హులైన నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వంలో కేటాయించారు. 2021లో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీ లే అవుట్‌గా వేసి 1.5 సెంట్ల చొప్పున 69 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. నివాసయోగ్యానికి అనువుగా రహదారులను మెరక తోలించి హద్దు రాళ్లను ఏర్పాటుచేసి అర్హులైన వారికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ లేఅవుట్‌పై టీడీపీ నాయకుల కన్నుపడింది. ఇంకేముంది ఎంచక్కా ఆక్రమించుకుని హద్దు రాళ్లని తొలగించి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పుటికైనా అధికారులు స్పందించి ఇళ్లస్థలాలకు కేటాయించిన భూములను స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుటాం

బొరమాదిగపల్లి గ్రామంలోని ఇళ్లస్థలాల భూమి అక్రమణకు గురైనట్లు ఇప్పడే నా దృష్టికి వచ్చింది. ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించాం. వీఆర్వోను పంపి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– నాంచారయ్య, తహసీల్దార్, నగరం

రాష్ట్ర వెటరన్ క్రీడా పోటీల విజేతగా విశాఖ

ద్వితీయ, తృతీయ స్థానాల్లో గుంటూరు, బాపట్ల

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆరవ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2024 విజేతగా విశాఖపట్నం నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో గుంటూరు, బాపట్ల నిలిచాయి. రెండు రోజులుగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారంతో ముగిశాయి. విజేతలకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్, ఏపీఐడీసీ కార్పొరేషన చైర్మన్ డేగల ప్రభాకర్‌లు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పెమ్మసాని మాట్లాడుతూ.. ఆరోగ్యంపై శ్రద్ధ ఉంటే నిత్యం సంతోషంగా గడిపేయొచ్చన్నారు. వెటరన్ క్రీడాకారుల ప్రదర్శన యువతకు ఆదర్శమన్నారు. రాష్ట్రంలో నూతన క్రీడాపాలసీ వచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు జిల్లా ప్రజలకు లభిస్తాయన్నారు. షేక్ లాల్‌వజీర్ మాట్లాడుతూ.. సుమారు 400 మంది పాల్గొన్నారని, పోటీలకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిల, కార్యదర్శి శ్రీలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నజీర్, మాదిలేటి రెడ్డి, బేగం, ఆదం షఫీ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



100 మీటర్ల పరుగు పందెంలో తలపడుతున్న 55 నుంచి 80 సంవత్సరాల పురుషులు

క్లుప్తంగా

జొన్నవిత్తులకు పుట్టంరాజు పురస్కారం



అద్దంకి: సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు జనవరి ఐదో తేదీన ఉదయం పది గంటలకు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున 2025 సాహిత్య పురస్కారాన్ని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో అందజేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆదివారం తెలిపారు. అందుకు సంబంధించిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవీఎం సత్యనారాయణ, డాక్టర్ యూ దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, చిన్న మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, చండూరి మురళీ సుధాకరరావు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఘటనలో రెండో వ్యక్తి మృతి



బల్లికురవ: బతుకుదెరువు కోసం తమిళనాడు, అనంతపురం ప్రాంతాల నుంచి వలస వచ్చిన గ్రానైట్ కార్మికులు ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో రెండో వ్యక్తి వైద్యశాలలో చికిత్స పొందుతూ చనిపోయాడు. శనివారం రాత్రి బల్లికురవ, సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డులో ఈర్ల కొండ ఎస్ఆర్ క్వారీ సమీపంలో ఆగిన లారీని బైకుపై వెళ్తున్న ఇద్దరు కార్మికులు వెనుక నుంచి కొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో బైకు నడుపుతున్న తమిళనాడుకు చెందిన వెంకటేష్ అక్కడికక్కడే చనిపోగా వెనుక కూర్చున్న అనంతపురం జిల్లా తాడిపర్తికి చెందిన వివేకానందరెడ్డి (29) తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివేకానందరెడ్డి అవివాహితుడు. ఏడేళ్లుగా ఇక్కడ క్వారీలో పనిచేస్తున్నాడు. వెంకటేష్ 10 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నాడు. వెంకటేష్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. బల్లికురవ ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృత్యువాత

వేటపాలెం: నీటి గుంతలో ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పాపాయిపాలెం గ్రామం శివారు పొలాల్లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పీ వెంకటేశ్వర్లు (58) తమ పశువులను ప్రతి రోజు పొలానికి తోలుకెళ్లి మేపుకొని వస్తుంటాడు. అదే మాదిరిగా ఆదివారం కూడా పొలానికి పశువులను మేపుకోవడానికి తోలుకెళ్లాడు. పొలంలో ఉన్న నీటి గుంతలో దిగాడు. గుంతలో నుంచి రెండు రోజుల కిందటే ఇసుక మాఫియా ఇక్కడ నుంచి ఇసుక తరలించారు. దీంతో గుంత లోతుగా ఉండటంతో ఇది గమనించని వెంకటేశ్వర్లు దిగడంతో నీటిలో మునిగిపోయాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈపురుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

యాప్‌ల భారంపై ఉపాధ్యాయుల ఆగ్రహం



జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్‌బాబు

బాపట్ల టౌన్: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్వహిస్తున్న యాప్‌లతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల ఆర్థిక ప్రయోజనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అయినప్పటికీ పెండింగ్ బకాయిల విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తించడం ఉపాధ్యాయ వర్గానికి ఆగ్రహం కలిగిస్తోందన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 117 ను రద్దు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. అనేక రకాలైన యాప్‌ల వలన ఉపాధ్యాయులు బోధనకు దూరం కావడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. శిక్షణ, మరోపక్క పరీక్షల నిర్వహణ, అపార్, టిస్ వంటిన పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్ రామచంద్రయ్య మాట్లాడుతూ బదిలీ చట్టం పారదర్శకంగా రూపొందించాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఉపాధ్యాయులపై పని ఒత్తిడి మరింతగా అధికమైందని చెప్పారు. ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి సూచనలు, సలహాలు స్వీకరించి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ పీవీ నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు చందా నరసింహారావు, గుగ్గిలం ఉదయ శంకర్, రాష్ట్ర బాధ్యులు వంకా ప్రభాకర్ రావు, కేఏకే జిలాని, జిల్లా ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృతిపై ఆందోళన

కలుషిత సముద్రపు నీరు, మరబోట్లే కారణం



ఒడ్డుకు కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

చినగంజాం: సముద్ర పర్యావరణానికి నేస్తంగా భావించే సముద్ర తాబేళ్లు మానవ తప్పిదం కారణంగా మృత్యువాత పడుతున్నాయి. బాపట్ల జిల్లా సముద్ర తీర గ్రామాల వెంబడి ఆలీవ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు అధిక సంఖ్యలో చేరుతున్నాయి. సూర్యలంక నుంచి మొదలుకొని చినగంజాం మండలంలోని ఏటిమొగ వరకు ప్రతి ఏడాది 150–200 వరకు ఈ తాబేళ్లు చనిపోతుంటాయి. చినగంజాం మండలంలోని సముద్ర తీరానికి రెండు రోజుల్లో 14కుపైగా కళేబరాలు కొట్టుకొచ్చాయి. మోటుపల్లి, పల్లెపాలెం తీరంలో రెండు రోజులుగా కళేబరాలు కొట్టుకొని వస్తున్నాయి. జంతు ప్రేమికులు, సముద్ర తీర సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర పర్యావరణ రక్షణకు తాబేళ్లు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రతికూల పరిస్థితులలో ఆ జాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. శీతాకాలంలో ఆడ తాబేళ్లు సముద్రంలో కిలో మీటర్లు దూరం ప్రయాణించి తీరానికి చేరే ప్రయత్నం చేస్తాయి. అనువైన చోట గుడ్లు పెట్టేందుకు స్థలం ఎంపిక చేసుకుంటాయి. నవంబర్ నుంచి మే నెల వరకు ఎక్కువగా వస్తుంటాయి. ఆడ తాబేళ్లు తీరంలో రాత్రిళ్లు జన సంచారం లేని సమయంలో ఎక్కువగా కనిపిస్తాయి. లోతైన గుంతలను తవ్వి వాటిలో 100 నుంచి 150 వరకు గుడ్లను పెట్టి వెళ్లిపోతాయి. ఏప్రిల్, మే ప్రాంతంలో గుడ్ల నుంచి పిల్లలులు బయటకు వచ్చి సముద్రంలోనికి చేరుతాయి. కలుషిత సముద్రపు నీరు, ఆధునిక మరబోట్లు తాకిడి తాబేళ్ల పాలిట మృత్యుపాశం అవుతోంది. తమిళనాడులోని కడలూరుకు చెందిన డబుల్ మరబోట్లకు ఉండే ఫ్యాన్‌లు కారణంగా అవి గాయాలపాలై ప్రాణాలను కోల్పోతున్నాయి. తాబేళ్లు చిక్కినా వల నుంచి తప్పించి నీటిలో వదలి వేస్తామని స్థానిక మత్స్యకారులు అంటున్నారు.

మరబోట్లతో తాబేళ్ల ఉనికికే పెను ప్రమాదం



ఈ తాబేళ్ల రక్షణకు ఫౌండేషన్ తరఫున చర్యలు తీసుకుంటున్నాం. అవి తీరానికి వచ్చే సమయంలో డబుల్ మరబోట్ల ఫ్యాన్‌ల తాకిడికి తీవ్ర గాయాలపాలై చనిపోతున్నాయి. కళేబరాలు తీరానికి వచ్చిన సమయంలో ట్రీ ఫౌండేషన్ సిబ్బంది వాటిని పర్యావరణానికి హాని కలగకుండా పూడ్చిపెడతారు. ఆ వివరాలను డీఎఫ్ఓ దృష్టికి తీసుకొని వెళ్తాం.

– శవనం చంద్రారెడ్డి, ట్రీ ఫౌండేషన్ జిల్లా ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కో ఆర్డినేటర్

బహిరంగ ప్రదేశాల్లో వేడుకలకు అనుమతుల్లేవు

- ప్రజలకు ఇబ్బందుల్లేకుండా నూతన సంవత్సర ఉత్సవాలు నిర్వహించుకోవాలి
- ఈ సంవత్సరం పెరిగిన రహదారి ప్రమాదాలు
- మార్చి కల్లా 5 వేల సీసీ కెమెరాలు
- వార్షిక నేర సమీక్షలో జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో ఆల్కాహాల్, కేక్‌లు కట్ చేసేందుకు అనుమతుల్లేవని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇండోర్‌లో నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని చెప్పారు. నిర్ణీత వేళల్లో దుకాణదారులు మూసివేయాలని అన్నారు. ఈవెంట్స్ కోసం అనుమతి తీసుకున్న నిర్వాహకులు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతిస్తామని, తర్వాత మూసివేయాలని అన్నారు. ఆల్కాహాల్ విషయమై ఎక్సైజ్‌శాఖ అనుమతి ఉందా లేదా చూసుకోవాలని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ర్యాష్ డ్రైవింగ్ చేపట్టిన చర్యలు ఉంటాయని, డ్రంకన్ డ్రైవ్ చేపడతామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చేసుకోవాలని సూచించారు. 2023–24 నేరాల సంఖ్య తగ్గాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఐదు శాతం పెరిగాయని అన్నారు. జిల్లాలో వివిధ నేరాలతో ప్రమేయం ఉన్న 12 మందిపై పీడీ యాక్ట్‌లు నమోదుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడిలో ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. ఇప్పటికే 620 సీసీ కెమెరాలు ఉన్నాయని, వచ్చే ఏడాది మార్చి కల్లా ఐదు వేల సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐదారు నెలల కిందట చేబ్రోలులో జరిగిన మైనర్ బాలిక హత్య కేసుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, నిందితుడ్ని అరెస్ట్ చేశామన్నా రు. సైనెడ్ కలిపి మహిళలను హత్య చేసిన ముఠాను చాకచాక్యంగా పట్టుకున్నామని ఎస్పీ గుర్తుచేశారు. జిల్లా ఏఎస్పీలు ఏటీవీ.రవికుమార్ (ఎల్ఓ), సుప్రజ (క్రైం), డీఎస్పీలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

జిల్లా మైనింగ్ అధికారి రాజేష్‌కుమార్



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టరు

బాపట్లటౌన్: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ అధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెదుళ్లపల్లి సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి సీజ్ చేశారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, బుసకను ఎవరైనా తరలించినా, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎక్కువ లోతు తవ్వినా అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సీజ్ చేసిన ట్రాక్టర్లను వెదుళ్లపల్లి పోలీసులకు అప్పగించారు.

గురుకుల విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాడికొండ: తాడికొండ ఏపీ గురుకుల పాఠశాలలో 1999వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. పిల్లాపాపలతో పాఠశాలకు చేరుకున్న నాటి విద్యార్థులు తమ తోటి వారిని ఆప్యాయంగా పలకరించారు. నాటి స్మృతులు నెమరువేసుకున్నారు. తరగతి గదులలో కలియదిరిగి నాడు చదివిన తీరు, ఇతర విశేషాలను కుటుంబసభ్యులకు చూపించి సంతోష పడ్డారు. నాటి క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని సభాపూర్వకంగా వివరించారు. వారు నేర్పిన విద్యాబుద్ధులే నేడు తమను ఉన్నత శిఖరాలకు చేర్చాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవితాలకు పునాదులు వేసిన పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం నాటి గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ అదనపు కమిషనర్ కె.రాకేష్, ఏపీఆర్ఈఐఎస్ ఎస్ఈ రమణ, కేఆర్ దేశాయ్, రవికుమార్, ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ ఎం.జోగారావు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగి వస్తున్నాడని భర్తపై భార్య దాడి



వేటపాలెం: భర్తపై భార్య దాడి చేసిన ఘటనలో భర్త తీవ్రగాయాల పాలయ్యాడు. ఈఘటన చల్లారెడ్డిపాలెం పంచాయతీ జబ్బార్ కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. జబ్బార్ కాలనీకి చెందిన గౌరాబత్తిన సుబ్బారాయుడు అనే వృద్ధుడు ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా మద్యం తాగి భర్త ఇంటికి వచ్చాడు. దీంతో విసుగు చెందిన భార్య రామలక్ష్మి భర్త తలపై కర్రతో దాడి చేసింది. భర్త తల పగిలి తీవ్రగాయమైంది. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎం వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుడిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలి



కేఎస్ లక్ష్మణరావుకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న కృష్ణా–గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. ఆదివారం మెడికల్ కళాశాల వద్ద ఉన్న ఎన్జీవో కల్యాణ మండపంలో కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో శాసనమండలిని పునరుద్ధరించిన తరువాత 17 ఏళ్లలో 14 మంది ప్రోగ్రెసివ్ డెమోక్రిటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పక్షాన ఎమ్మెల్సీలుగా గెలుపొంది నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతోపాటు నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతులు, కార్మికులు, విద్యార్థులు తదితర అన్ని వర్గాల సమస్యలపై శాసనమండలి వేదికగా పనిచేశానని చెప్పారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి నిజాయితీగా పనిచేశామని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ ప్రయోజనాల కోసం పీడీఎఫ్ పనిచేస్తోందని తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఎస్.నాగయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం లక్ష్మణరావు పనిచేస్తారని చెప్పారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు వీవీకే సురేష్ మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను లక్ష్మణరావు బలపరిచారని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘ నాయకురాలు రత్న, మోడల్ స్కూల్స్ యూనియన్ నాయకులు హేమలత, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, యూనివర్సిటీ యూనియన్ నాయకులు భానుప్రసాద్, ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు గాంధీ మోహన్ రావు, పోస్టల్ యూనియన్ నాయకులు రామకృష్ణ, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆవాజ్ నాయకులు చిష్టీ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకురాలు ధనలక్ష్మి, పాలిటెక్నిక్ అధ్యాపక సంఘ నాయకురాలు స్వాతి తదితరులు ప్రసంగించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం?

నంబూరు మహిళ హత్య కేసులో వెలుగులోకి పలు విషయాలు



చిన్నారితో షేక్ మల్లిక, ప్రేమ్‌కుమార్ (ఫైల్)

పెదకాకాని: వివాహేతర సంబంధం కారణంగానే నంబూరులో మహిళ హత్యకు గురైనట్లు తెలిసింది. స్థానికుల ద్వారా సేకరించిన విశ్వసనీయ సమాచారం మేరకు... పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో చనిపోయిన షేక్ మల్లికది హత్యేనని నిర్ధారణ అయింది. నంబూరుకు చెందిన షేక్ మల్లికను పది ఏళ్ల కిందట అదే గ్రామానికి చెందిన షేక్ అక్బర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి పాప, బాబు సంతానం. మల్లిక ప్రవర్తనపై భర్తకు అనుమానం రావడంతో పిల్లలు పుట్టిన కొద్ది రోజులకే గొడవలు జరిగాయి. దీంతో ఆమె భర్త నుంచి విడిపోయింది. తరువాత గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్‌ను వివాహం చేసుకుంది. వీరు కొంతకాలంపాటు గుంటూరులో కాపురం పెట్టారు. ఆ సమయంలో బంగారం వ్యాపారం చేసే రెహమాన్‌తో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. మల్లికకు సంతానం కలగకుండా ఆపరేషన్ అయింది. దీంతో సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేసి మల్లిక దంపతులు పెంచుకునేందుకు పాపను కూడా రెహమాన్ తీసుకొచ్చి ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల దంపతులు నంబూరుకు కాపురం మార్చారు. అప్పటి నుంచి రెహమాన్‌కు ఆమె దూరంగా ఉంటోంది. స్థానిక యువకుడితో వివాహేతర సంబంధం కారణమని రెహమాన్ గుర్తించాడు. దీంతో శనివారం ఆమెను హత్య చేసేందుకు ఇద్దర్ని నంబూరు పంపాడు. మల్లిక విషయాలను మరొక మహిళ ఫోన్ ద్వారా రెహమాన్‌కు చేరవేస్తూ వచ్చింది. ప్లాన్ ప్రకారం ముఖానికి మాస్కులు ధరించిన ఆ ఇద్దరు వ్యక్తులు ఆమెను హతమార్చి తిరిగి వెళ్లిపోయినట్లు తెలిసింది. దీనిపై పెదకాకాని సీఐ టి.పి. నారాయణ స్వామి మాట్లాడుతూ కేసు దర్యాప్తులో ఉందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

హక్కుల కోసం గిరిజనులు ఐకమత్యంగా పోరాడాలి

- రిటైర్డ్ ఐఏఎస్ మాటా రామారావు
- గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ వేడుకలు



సమావేశానికి హాజరైన సంఘం ముఖ్యనేతలు

గుంటూరు మెడికల్: గిరిజనులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని, న్యాయమైన తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మాటా రామారావు సూచించారు. ఆదివారం గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ మీటింగ్ హాలులో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్, గుంటూరు జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాట రామారావు, డెప్యూటీ కలెక్టర్ కె.రాములు నాయక్ హాజరయ్యారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేడా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి బాణావత్ చిన్న స్వామినాయక్ మాట్లాడుతూ గిరిజనులు విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని, విద్యా ద్వారా మనకు సమస్తం లభిస్తాయని చెప్పారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు తమకు రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ ప్రకారం ఉద్యోగ నియమకాలు, ప్రమోషన్స్ విషయంలో తగినంత అవగాహనను కలిగి ఉండాలన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు పి.వి.రమణ మాట్లాడుతూ 1964 సంవత్సరంలో కుంభ రంగారావు ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ సంఘం అంచలంచలుగా ఎదుగుతూ నేడు డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. సంఘం అభివృద్ధికి పాటుపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి హరిరామ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విభాగాలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఎక్కువమంది సభ్యులను సభ్యత్వం ఇచ్చి సంఘాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు విషయం గురించి, తీసుకోవలసిన బాధ్యతల గురించి వివరించారు. గుంటూరు జిల్లా సంఘం అధ్యక్షులు మేడా శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ మొగిలి శ్రీనివాసరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నాయకులు బాలు నాయక్ భూక్య, దినారి ప్రభాకర్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు ఇండ్ల సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయ్యాల శ్యాం వరప్రసాద్, రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్స్ డాక్టర్ బాలాజీనాయక్ బానోత్, రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షుడు పేరం పవన్‌కుమార్, గుంటూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి మూడవత్ కోటేశ్వరరావు నాయక్, కోశాధికారి పాలపర్తి శ్రీనివాస్‌రావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, కాంద్ర కొండ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పికిల్‌బాల్ పోటీలకు ఏడుగురు ఎంపిక



గుంటూరు వెస్ట్(క్రీడలు) ఒడిశాలోని భువనేశ్వర్‌లో జనవరి 3 నుంచి 5 వరకు జరగనున్న జాతీయ స్థాయి పికిల్ బాల్ పోటీలకు వివివి హెల్త్ క్లబ్ నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని క్లబ్ డైరెక్టర్ కె.అరుణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ క్లబ్‌లో సాధన చేస్తున్న పి.ఆనంద్‌కుమార్, కె.అరుణ్‌కుమార్, ఎం.భరత్‌కుమార్, నాగరాజు, పి.సూర్య ఆకాష్, చరణ్, మన్సూర్ వలిలు రాష్ట్ర పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యారన్నారు. క్లబ్‌లో ఎంపికైన క్రీడాకారులను ఏపీ పికిల్ బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీధర్, కోచ్ జీవీఎస్ ప్రసాద్, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబులు అభినందించామని తెలిపారు.

దేశాభివృద్ధికి యువత కృషి కీలకం



స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న తులసి రామచంద్ర ప్రభు

తెనాలి: యువతరం తమ మేధస్సును దేశ ప్రగతికి వినియోగించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు సూచించారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు 20వ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రదానం కార్యక్రమం జరిగింది. 341 మంది విద్యార్థులకు రూ.16 లక్షలను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లిముంత వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. రామచంద్రప్రభు మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. తులసి రామచంద్రప్రభును అభినవ శ్రీకృష్ణ దేవరాయ బిరుదుతో సత్కరించారు. రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రంగిశెట్టి జగదీష్ బాబు, ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్ర, హైదరాబాద్‌లోని హిమాన్వీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరవ రామకృష్ణ, సంఘ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జె.కోటినాగయ్య, విశ్రాంత ఐఆర్ఎస్ బళ్లా నరేంద్రకుమార్, డాక్టర్ బి.సాంబశివరావు, డాక్టర్ ఇమ్మడిశెట్టి మారుతీప్రసాద్, డాక్టర్ గాలి దీప్తి, సీఆర్‌డీఏ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. తొలుత వి.నిత్యసంతోషి కూచిపూడి నృత్యం ప్రదర్శించగా, విజయనగరం జిల్లాకు చెందిన జి.వినోద్ కుమార్ గజల్స్ ఆలపించి అలరించారు.

మున్సిపల్ ఆర్ఐకి అభినందన



బాపట్ల: మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇమామ్‌కు ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ 2024లో గోల్డ్ మెడల్ దక్కింది. ఆయన్ను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ.. గుంటూరులో జరిగిన అథ్లెటిక్స్‌లో బాపట్ల జిల్లా నుంచి పాల్గొన్న తనకు బంగారు పతకం, సిల్వర్ మెడల్స్ వచ్చాయని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో కేరళలో జరిగే నేషనల్ మీట్‌కు అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.